# రాజకీయ స్వాతంత్ర్యం

ఇది జరిగినది ఫలానా శతాబ్దిలో అని చెప్పలేను. ఎందుకంటే నాకు చరిత్ర పరిజ్ఞానం ఏ మాత్రము లేదు. సాహితీ పరుడు చరిత్ర జ్ఞానం లేకుండా చరిత్రనూ, సామాజిక జ్ఞానం లేకుండా సామాజిక జీవితాన్ని, శాస్త్రజ్ఞానం లేకుండా సైన్సు ఫిక్షనూ రాయవచ్చునని విమర్శకులు నాకు అధికార పూర్వకంగా చెప్పారు. అందులో నాకు బేసబబేమీ కనిపించలేదు. సినిమా శిల్పం తెలీనివాళ్లు సినిమాలు తీస్తున్నారు కాదా ? నిన్నటి దాకా బ్రిడ్జీలూ, వంతెనలకు మంత్రిగా వున్నాయన అకస్మాత్తుగా ఏనుగులూ గుర్రాల మంత్రి అయితే ఆయన జంతుశాస్త్రంలో డాక్టరేటు సంపాదించాడనుకోలేం గదా ?

నా కథలో మాధవపురం ఎక్కడుున్నదో నాకు తెలీదు. జాగ్రఫీ కూడారాదు. నేను చిన్న పిల్లలకోసం కథ రాద్దామని అంగదేశం ప్రక్కన విదర్భదేశం వున్నట్టు రాస్తే, అది అచ్చు పడిన తరువాత నన్ను కొందరు జాగ్రఫీ ప్రవీణులు తప్పుపట్టారు. పత్రిక వాళ్ళకు లేనిదీ, పాఠకులకు లేనిదీ మధ్య జాగ్రఫీ మేస్టర్ల కెందుకు ? సినిమా ప్రొడ్యూసర్లు ప్రజలకు వినోదం అందించే అర్హత తప్ప ప్రబోధాలు అందించే అర్హతగల వాళ్ళం కామని స్పష్టంగా తెగేసి చెప్పినట్టుగా, నేను కథలు రాయగలనేకాని, జాగ్రఫీ హిస్టరీ పాఠాలు కథల ద్వారా అందించే అర్హత గలవాణ్ణి కానని స్పష్టంచేసి, కథకు వస్తాను.

ఆ రాజ్యం పేరు మాధవపురం. దాన్ని మాధవశర్మ పాలించేవాడు. మాధవపురం చాలా విస్తీర్ణమైన దేశం. జనాభా రెండు లక్షలు. అందులో లక్షా 90 వేలమంది గ్రామాలలో వ్యవసాయం చేసుకుంటూ, వ్యవసాయంపనులు లేనప్పుడు పురాణాలు వింటూ వుండే వాళ్ళు. అయోధ్యలో రాముడు, ద్వారకలో కృష్ణుడు, హస్తినాపురంలో పాండవులు ఇంకా ఏలుతున్నారనే వాళ్ళ నమ్మకం .మాధవవర్మ పరిపాలనలో వాళ్ళకు సంపూర్ణమైన స్వేచ్ఛ వుండేది. ఒకరిద్దరు గ్రామాధికారులతో మాత్రమే గ్రామస్తులకు సంబంధం వుండేది. తమ దేశాన్ని మాధవవర్మ అనే ఆయన ఏలుతున్నాడని కూడా వాళ్ళకు తెలీదు. మాధవవర్మ పట్టాభిషేకానికి చాలా గ్రామాల నుంచి ఎవరూ వెళ్ళనే లేదు.

అయితే, వాళ్ళ స్వాతంత్ర్యం అకస్మాత్తుగా పోయింది. మాధవపురాన్ని ఎవరో ఓడించారని తెలిసింది. ఆ మాట తెలిసిన వాళ్ళు బాధపడ్డారనికాదు. ఆ ఓడించిన జాతివాళ్ళను చూసి మాత్రం జనం ఆశ్చర్యపోయారు. ఆశ్చర్యపోయి, "ఎవరు వీళ్లు ?" అని అడిగారు.

"మ్లేచ్ఛులు, మ్లేచ్ఛ దేశం వాళ్ళు" అని జవాబు వచ్చింది.

ఒక కొత్తదేశం పేరూ. ఒక కొత్తజాతి పేరూ మాధవపురం పౌరుల చిత్తాలోకి ఎక్కింది. మ్లేచ్ఛ శబ్దం ద్వేషవాచకమనీ, దాన్ని ఎన్ని విధాలుగానైనా ఉపయోగించ వచ్చుననీ కూడా తెలిపింది.

కాని, మాధవ పౌరులకు తమ స్వాతంత్ర్యం పోయినప్పుడు ఎలా తెలిసిందంటే కొత్త పన్నులు వచ్చిపడిపినప్పుడు, తమలో పాత పెత్తందార్లు కొందరు వెనకబడిపోయి, కొత్త పెత్తందార్లు బయలుదేరినప్పుడు ఈ త్రాసు తక్కెడల ఊపుకూ, స్వాతంత్ర్యం పోవడానికీ సంబంధం ఉందన్నారు.

పైకి వచ్చిన మాధవ పౌరులు మ్లేచ్ఛులవల్ల మాధవపురానికి కలిగిన లాభాలను గురించి చెప్పారు. రాశారు. గానం చేశారు. మ్లేచ్ఛపండుగలు కొన్ని వచ్చాయి. సరదాగానే వుంది !

మ్లేచ్ఛ శబ్దం దోషవాచకమూ, ద్వేషివాచకమూ, అవునా, కాదా? తెలియలేదు.

నాలుకలు రాస్తున్న చరిత్ర వేరు కలాలు రాస్తున్న చరిత్ర వేరు. మామూలు ప్రజలు పూర్వంకన్న ఎక్కువ శ్రమించి, తక్కువ రాబడి పొందుతున్నారు. దెబ్బతిన్న మొదటి తరం రుసరుసలాడింది. రెండో తరంవాళ్ళు తమ తండ్రులు తమకన్న బాగా బతికినట్టు చెప్పుకున్నారు.

"కాని మా చిన్నతనం నుంచీ మా బతుకు ఇలాగే ఉంటున్నది," అన్నారు.

మూడో తరంవాళ్ళకు కొన్ని లెక్కలు తెలియవచ్చాయి.

చరిత్రను బజారు కెక్కించేవాళ్ళు బయలుదేరారు. స్వాతంత్ర్య పోరాటం అంటూ తలఎత్తింది. మ్లేచ్ఛ పాలకులు మాధవాపురం నుంచి ఏటా లక్ష పణాలు కైంకర్యం చేస్తున్నారు. దీనివల్ల మాధవా పౌరుల దారిద్ర్యం పెరిగింది.

ఇలా ప్రచారం చేసినవాళ్ళను జైళ్ళలోకి తోశారు. స్వాతంత్ర్యోద్యమం ఉధృతమయింది. కాని ఆర్థిక స్థాయి పెరగలేదు. "మనం స్వేచ్ఛకోసం త్యాగంచేస్తున్నాం" అన్నారు.

"ఇది సరిఅయిన స్వాతంత్ర్యోద్యమం కాదు" అనే వాదన బయలుదేంది. అలా ప్రచారం చేసినవాళ్ళను కూడా జైళ్ళకి పంపారు.

అకస్మాత్తుగా మాధవపురం స్వతంత్రమయింది. ప్రజల కష్టాలు తీరాయన్నారు. స్వర్ణయుగం రాబోతోందన్నారు. ప్రజల మధ్య హెచ్చుతగ్గులు సమసిపోబోతున్నాయన్నారు. ఒక వెర్రి ఆనందం ఉప్పెన లాగా ముంచెత్తింది. ఉన్నది కూడా తెగనమ్మి కటికదరిద్రులదగ్గరనుంచీ పండగ చేసుకున్నారు.

సంకెళ్ళు తెగిపోయినందుకు దాఖలాగా పరిశ్రమలు పెరిగాయి. వాడుక సరకులు పెరిగాయి. వాటి నాణ్యత పెరిగింది. అన్నిటి ధరలూ పెరిగాయి.

స్వాతంత్ర్యోద్యమం నడిపినవాళ్ళు పెత్తందార్లు అయారు. దాన్నిబట్టే అయినా దేశం స్వతంత్రమయిందని తెలుస్తున్నది. భూదేవి నవ్వింది. పంటలు పెరిగాయి, ఆకలి పెరిగింది.

దరిద్రం పెరిగింది. అట్టడుగువాళ్ళ జీవితంలోకికూడా రాజకీయ వాయువులు ప్రసరించాయి. ఇది స్వేచ్ఛకు చిహ్నమో కొత్త బానిసతనం చిహ్నమో చెప్పినవారు లేకపోయారు.

నూరేళ్ళ మ్లేచ్ఛ పరిపాలనలో కూడా ప్రజలు ఎరగని అలజడి అయిదేళ్ళ స్వాతంత్ర్యంలో తలఎత్తింది - కొత్తతిరుగుబాటుదార్లు బయలుదేరారు. వీళ్ళను ప్రజా ప్రభుత్వం మట్టుబెట్టసాగింది.

రెండు లక్షలుండిన జనాభా నాలుగు లక్షలకు పెరిగింది. అందులో రెండు లక్షల మందికి రెండు పూటలా తిండిలేదు.

మ్లేచ్ఛ పరిపాలనలో ఏటా లక్షపణాలు కైంకర్యమయినాయని అలజడి చేసినవాళ్ళ ప్రజా ఏలుబడిలో ఏటా ఇరవై లక్షల పణాలు అనేక మ్లేచ్ఛదేశాలకు పోతున్నట్టు పత్రికలు రాశాయి.

అయితేనేం? ఇది సబబేనన్నారు. ఇంకా దేశాంతరాలకు పోతేగాని మాధవాపురం ఆర్థికంగా పైకిరాదట ! మాధవపురంలో చీపుళ్ళ పరిశ్రమా, పిడకల పరిశ్రమ దగ్గర నుంచి విశేష ధాల పరిశ్రమ దాకా అన్నీ మ్లేచ్ఛదేశాల అధీనమైననాడు మాధవ పౌరుల కనిష్ఠ వేతనం ఒక పూట తిండికి చాలనినాడు మాధవపురం ప్రపంచ దేశాలలో ఉన్నతికి వస్తుందట.

నాలాగే మాధవ పౌరులకు ఆర్థిక విషయాలు తెలియవు. అందుచేత ఈ కథను ఇలా మొండిగా వదిలెయ్యడమయింది.

ముద్రణ : 6 ఏప్రిల్, 1980 ఆంధ్రజ్యోతి వారపత్రిక.